# మొక్కలే జీవకోటికి ప్రాణాయుధం



మంగ్లూర్ నర్సరీలో మొక్కకు నీరు పోస్తున్న ఎంపీ బీబీపాటిల్

## జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్

నిజాంసాగర్/ పెద్దకొడప్‌గల్, జూన్19: మొక్కలే జీవకోటికి ప్రాణాయుధమని, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్ గ్రామ నర్సరీలో సోమవారం హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే హన్మంత్ షిండే, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు అధికారులు, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీ బీబీ పాటిల్ సూచించారు. అనంతరం మొక్కలు నాటి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యాలరీని పరిశీలించారు. మంగ్లూర్ పాఠశాల విద్యార్థులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతును అందించారు. హరితహారం కార్యక్రమం చేపట్టిన నాటి నుంచి 8 కోట్ల మొక్కలు జిల్లాలో నాటినట్లు జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే తెలిపారు. రాష్ట్రంలో 7.7 శాతం గ్రీనరీ పెరిగిందని ఇది మరింత పెరగాలని కోరారు. మొక్కలు పెరిగితే గ్రామాల్లో పచ్చదనం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు మొక్కల, జంతువుల సంరక్షణపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. తొమ్మిదో విడుత హరితహారం కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తున్నదని మొక్కల సంరక్షణకు



నాగిరెడ్డిపేట్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సురేందర్



చిన్న తక్కడ్‌పల్లిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

గ్రీన్ బడ్జెట్ సైతం కేటాయించిందని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న, వర్షాలు సమృద్ధిగా కురవాలన్నా గ్రీనరీ పెరగాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఎఫ్‌వో సాగర్, డీఎల్‌పీవో శ్రీనివాస్, సర్పంచులు సాయిలు, స్వప్న రమేశ్, కంసవ్వ, ఎంపీటీసీ సభ్యులు జనార్దన్, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగేశ్వర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని చిన్న తక్కడ్‌పల్లిలో ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో రాణి, ఎంపీవో సూర్యకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### హరిత తెలంగాణే లక్ష్యం

నాగిరెడ్డిపెట్, జూన్19: హరిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. మండలంలోని బంజారతండా అటవీ ప్రాంతంలో నిర్వహించిన హరితోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్క నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో హరితహారం ఒక యజ్ఞంలా కొనసాగుతున్నది అన్నారు. సీఎం కేసీఆర్ ప్రకృతి ప్రేమికుడని, తొమ్మిదేళ్లలో తెలంగాణలో 8 శాతం గ్రీనరి పెరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శివేంద్ర ప్రసాద్, ఎంపీపీ రాజదాస్, జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, గోపాల్‌పేట్ సర్పంచ్ వంజరి సునీత, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పిట్లం లయన్స్‌క్లబ్‌కు మూడు అవార్డులు

పిట్లం, జూన్19: పిట్లం లయన్స్‌క్లబ్ శాఖకు మూడు ఉత్తమ అవార్డులు లభించినట్లు జిల్లా లయన్స్‌క్లబ్ చైర్మన్ మరగల వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన లయన్స్‌క్లబ్ అవార్డుల కార్యక్రమంలో పిట్లం లయన్స్‌క్లబ్‌కు మూడు ఉత్తమ అవార్డులు వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ చైర్మన్‌గా మరగల వేణుగోపాల్‌కు ప్రత్యేక అవార్డు లభించడంతో లయన్స్‌క్లబ్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, డాక్టర్ కిషన్, నారాయణరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు బెంచీలు అందజేత

మద్నూర్, జూన్19: మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త దయానందరెడ్డి బెంచీలు, క్రీడా పరికరాలను అందించినట్లు పీజీ హెచ్‌ఎం సీతయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భీమ్, మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రాజేందర్, సురేశ్, రాజు, గ్రామస్తులు నాగేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను ఆదుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్/ నాగిరెడ్డిపేట్/ బిచ్కుంద/ మద్నూర్, జూన్19: ముదిరాజ్‌లకు 'ముదిరాజ్ బంధు' ఇచ్చి ఆదుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ కోరారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రూ. పది లక్షల ముదిరాజ్ బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘంలో గౌడ కులస్తులను చేర్చి రూ. లక్ష ఆర్థికసాయం అందించాలని కోరుతూ నాగిరెడ్డిపేట్ సంఘ సభ్యులు నాయబ్ తహసీల్దార్ రాందాస్‌కు వినతిపత్రం అందించారు. బిచ్కుంద మండల కేంద్రంలో మున్నూరు కాపు సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ మద్నూర్ సంఘ సభ్యులు తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ

లింగంపేట, జూన్19: మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం సభ్యులు బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. భూలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురవాలని, పాడి పంటలు బాగా పండాలని కోరుతూ బోనాలు నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పిట్లం, జూన్19: మండల కేంద్రానికి చెందిన నగేశ్ ఇళ్లు విద్యుదాఘాతంతో కాలిపోవడంతో బాన్సువాడ వారధి స్వచ్ఛంద సంస్థ సభ్యులు సోమవారం ఆర్థికసాయం అందించారు.నిత్యావసర సరుకులు, నగదు అందజేసి వారికి బాసటగా నిలిచారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోపాల్‌సింగ్, ఉపాధ్యక్షుడు కిషన్, సభ్యులు కృష్ణ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

**రామారెడ్డిలో..**

రామారెడ్డి, జూన్19: రెడ్డిపేట్‌కు చెందిన మెగ్గం లక్ష్మి ఇటీవల మృతి చెందడగా బాధిత కుటుంబానికి నారెడ్డి ట్రస్టు సభ్యులు ఆర్థికసాయం, నిత్యవసర సరకులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ధన్‌సింగ్, నరసింహరావు, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

నిజాంసాగర్, జూన్19: గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీని సోమవారం తనిఖీ చేశారు. గ్రామంలో పల్లె ప్రగతి పనులతో పాటు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఇంటి పన్ను వసూలుపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి అబ్బాగౌడ్, సర్పంచ్ బాలయ్య, ఉప సర్పంచ్ వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి సునీత ఉన్నారు.

## జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

సదాశివనగర్, జూన్19: మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను సర్పంచ్ బద్ధం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. పనులకు ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, ఉప సర్పంచ్ వంకాయల రవి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు మోహినుద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, విండో డైరెక్టర్ ఏనుగు జనార్దన్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, మాజీ ఎంపీపీ విజయా శివకుమార్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెసరి సాయిలు, డాక్టర్ సురేశ్‌గుప్తా, దాకయ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, జీపీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

## పాడి రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

సదాశివనగర్, జూన్19: పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని జిల్లా విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రోత్సహిస్తోందని అన్నారు. అనంతరం 20 మంది ఉత్తమ పాడి రైతులు, సిబ్బందిని సన్మానించి మెమోంటోలు అందజేశారు. డెయిరీలో రైతులతో కలిసి గడ్డిజాతి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ వైష్ణవి, జూనియర్ మేనేజర్ రెడ్డి స్వామి, మార్కెటింగ్ మేనేజర్ యాస్‌పాల్, మండలాల బీఎంసీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, రోహిత్‌రెడ్డి, సత్యంరెడ్డి, యాడారం రమేశ్ చారి, కృష్ణారెడ్డి, దుబ్బాక నర్సారెడ్డి, రాజేశం, సిబ్బంది ఇంద్రారెడ్డి, ఆరె నర్సింహులు, వడ్ల రాములు, అఫ్రోజ్, సంతోష్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు

నాగిరెడ్డిపేట్, జూన్19: రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే దుకాణాలు సీజ్ చేస్తామని కామారెడ్డి ఏడీఏ అపర్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్, ఫెస్టిసైడ్ దుకాణాలను సంబంధిత అధికారులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని లైసెన్స్, రిజిస్టర్లు, బిల్‌బుక్కులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. ఆమె వెంట అధికారులు, శ్రీనివాస్, విజయశేఖర్ ఉన్నారు.

## ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

గాంధారి, జూన్19: ఓటరు జాబితాలో పేర్లు లేని వారు ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోవర్ధన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ పేర్లను బీఎల్‌వోలో వద్ద ఈ నెల 22వ తేదీలోగా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తాడ్వాయి, జూన్19: దేమికలాన్ గ్రామానికి చెందిన మర్రి గంగామణికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ పౌరాజు కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇందిర, ఎంపీటీసీ నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

పిట్లం, జూన్ 19: మండలంలోని కారేగాం సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఉదయం రెండు బైకులు ఢీకొనగా ఒకరికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం కర్సుగుత్తివాసి రమాకాంత్ పిట్లం వైపు బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో రమాకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు అంబులెన్స్ ద్వారా పిట్లం ప్రభుత్వ దవాఖానకు తరలించిగా మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

లింగంపేట, జూన్19: మండలంలోని బాణాపూర్‌లో ద్విచక్ర వాహనంతో పాటు సెల్ ఫోన్ చోరీ చేసిన నిందితుడిని పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. బాణాపూర్ తండాకు చెందిన ధరావత్ బలరాం నూతన గృహనిర్మాణం చేపడుతుండగా లేబర్‌గా పనికి వచ్చిన మహారాష్ట్ర మునావత్ గ్రామానికి చెందిన వైద్యనాథ్ విష్ణు బైక్, సెల్ దొంగిలించినట్లు పేర్కొన్నారు. నిందితుడిని సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పట్టుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## 30న తాత్కాలిక అధ్యాపకుల భర్తీకి డెమో

ఎల్లారెడ్డి రూరల్, జూన్19: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 30 నుంచి డెమో తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ రీజియన్ ఆర్సీవో మేరీ ఏసుపాదం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బోధించేందుకు ఎంపిక చేయబడే తాత్కాలిక సిబ్బందికి డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూనియర్ లెక్చరర్ 11, పీజీటీ 7, టీజీటీ 9, అసిస్టెంట్ కేర్ టేకర్ 6 పోస్టులు ఖాళీ ఉన్నాయని యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం 50శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు బీ.ఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. ధర్మారంలోని కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.